# తులసిమొక్క

సదానంద్ శారద

గంజాయి తోటలో తులస మొక్క వుంటుందో లేదో కాని, ఆ ఆఫీసులో గుర్నాథంవున్నాడు.

గుర్నాథం ఆఫీసుకు ఆలస్యంగా రాడు- నోటు మీద రిమార్కు పడడు. ఫైళ్ళను బరువు కోసం ఆపడు- బల్ల కింద చేతులు పెట్టడు. బాతాఖానీతో నేస్తం చేయడు... లంచ్ అవర్‌ను లంచవర్స్ చేయడు- గుర్నాథం ఒఠ్ఠి మూర్ఖుడని అతని కొలీగ్స్ అభిప్రాయం.

మొన్ననే ఉద్యోగంలో చేరిన జనార్దన్ ఖూడా ఆ మాటే అంటాడు-

ఉద్యోగంలో చేరిన రెండు నెలల్లోనే జనార్దన్ రెండో వేలికి కూడా ఉంగరం వచ్చింది. కాళ్ళకు మరో జత మాడర్న్ షూస్ వచ్చాయి. మొదటి ఉంగరం, మొదటి జత షూస్ వాళ్ళ అత్తగారు పెట్టినవని వేరే చెప్పనక్కర లేదు.

ఒక్క గుర్నాథం తప్ప ఆఫీసులో అందరి స్థితి మూడు పూవుల జీతం, ఆరుకాయల రాబడిగా వుంది. ఆఫీసుకొచ్చే పార్టీలనో, అత్తగారినో దోచుకొని వుండాలి తప్ప వారి ఒంటిమీది, వారి భార్యల ఒంటిమీది సంపదలకు, ఇళ్ళలోని సంపదలకు జీతం రాళ్ళు ఆధారం కాదు. అది గ్లోబల్ ఫినామినన్ అని తేల్చేస్తున్నాంకదా- ఇక వాళ్ళెందుకు మారుతారు!

గుర్నాథం దిగులుగా వున్నాడు. అతని గుండెలో గుబులు వరదగూడులా వుంది. అతని కళ్ళలో నీళ్ళు సుడులు తిరుగుతున్నాయి. అతనికి బతుకు భయంకరంగా, భవిష్యత్తు చీకటిగా వుంది.

'ఎందుకిలా జరుగుతున్నది?... ఎందుకిలా జరుగుతున్నది' అని బాధగా అతడు వేళ్ళతో నొసటిమీద నొక్కుకున్నాడు. 'అత్యవసరాలకు మాత్రమే ఖర్చు పెడుతున్నా, ఎందుకు తన జీతం జీవితానికి సరిపోదు? ఎందుకీ అవస్థలు? ఎక్కడున్నది లోపం??'

అతని తల నరాలు వేడెక్కుతున్నాయి. కలం చేతికి బరువుగా వుంది. కాగితాల మీద కలాన్ని వుంచి భారంగా కళ్ళు మూసుకున్నాడు. ఆ కళ్ళల్లో ఇంటివద్ద తన కోసం దీనంగా ఎదురుచూసే భార్య కనిపించింది. జబ్బుతో మంచాన పడిన కొడుకు కనిపించాడు. పాలకోసం ఏడ్చే చంటిది కనిపించింది. కొడుక్కు మందులు, చంటి దానికి పాలడబ్బాలు గుర్తుకొచ్చాయి. 'అవి కూడా జీవితంలో భాగంకదా- తన జీతం ఆ ఖర్చులకు ఎందుకు మిగలదు?'

రోజు రోజుకు పెరిగిపోతున్న ధరలు పేదల్ని నిరుపేదల చేస్తూ, మధ్యతరగతి బతుకుల్లోని ఆనందాన్ని హరించివేస్తున్నాయి. వాళ్ళ జీవితాల్ని పీల్చి పిప్పి చేస్తున్నాయి. వాళ్ళ ఆశల్ని ఎండమావుల మీద ఆర వేస్తున్నాయి. వారి బడ్జెట్‌ను తారుమారు చేస్తున్నాయి. ఈ నెలలో ఇరవై రూపాయిలు మిగుల్తాయి అనుకుంటె ఇన్నూరు అప్పులు తలపైకి ఎత్తుతున్నాయి.

ఆర్టీసీ కండక్టర్‌కు కాఫీ హోటల్‌తో పరిచయం లేదంటే ఎంత ఆశ్చర్యమో, గవర్నమెంట్ ఆఫీసులో పనిచేసే గుర్నాథం లంచం ముట్టడు అంటే కూడా ఆశ్చర్యమే! ఆశ్చర్యమే అయినా అది నిజం. కనీసం సిగరెట్టు కాల్చే అలవాటు కూడా లేదు గుర్నాథానికి. చేతిలో డబ్బులు లేనప్పుడు సినిమాలు చూడడు. హోటల్ కాఫీ తాగడు.

కొడుక్కు అర్జంటుగా మందులు కొనాలి- చంటి దానికి పాలడబ్బా కావాలని చెప్పింది భార్య. గవర్నమెంటువారి సలహా ప్రకారం ఇద్దరినే కన్నారు. ఆ ఇద్దరిని కూడా సక్రమంగా పోషించుకోలేకపోతున్నాడు.

అప్పు తప్పే... కాని తప్పేది కాదు.

అప్పు తప్ప మరో మార్గం కనిపించలేదు గుర్నాథానికి- పక్కింటి సుబ్బమ్మ మంచి పక్క సీటు ఏకాంబరం దాకా అతనికి తెలిసినవారంతా ఒకసారి మనసులో మెదిలారు-

సుబ్బమ్మ అగ్గిపుల్లకో, సబ్బుబిళ్ళకో తమ ఇంటికి వస్తుంది. అప్పులు ఇవ్వదు- మిగతా వాటాలవారితో వారికి డిస్టర్బ్ అవుతుందని మాట్లాడడానికే మొహమాట పడతాడు గుర్నాథం. అలాంటిది అప్పు అడుగుతాడా!

ఇంటి ఓనర్‌నే అడిగితే... 'ఊహూ... మీ పరిస్థితి ఇదా! వచ్చే నెలలో ఇల్లు ఖాళీ చేయండి- ఎవరైనా మంచివాళ్ళను చూసి ఇచ్చుకుంటాం-' అంటాడు. మంచివాళ్ళు అంటే ఇంటి ఓనర్ల భాషలో అడిగినంత అద్దె నోరు మూసుకుని ఇచ్చేవారు, అవసరం వుందంటే అడ్వాన్సుల రూపంలో అప్పులు ఇచ్చేవారు- పుచ్చుకునే వారు కాదు.

అతన్ని అప్పడిగి ఇల్లు ఖాళీ చేసే ప్రమాదాన్ని తెచ్చుకోలేడు- ఇల్లుకోసం వీథుల వెంట తిరిగే ఓపిక లేదు.

ఆ వీథిలో కూడా వెలగని మునిసిపాలిటీ స్తంభాలున్నాయి- ఆ వీథిలో గుర్నాథానికి అప్పు ఇచ్చే ఆత్మీయులు లేరు-

'ఆఫీసులోనే ఎవర్నైనా అడగాలి!' అనుకున్నాడు. అనుకున్నప్పటినుంచి ఇబ్బందిగా వుంది... గుండె బరువుగా వుంది అతనికి.

లంచవర్ ఇంకా గంట వుందనగానే ఏకాంబరం ఫైళ్ళను మూసేస్తాడు-

అలా ఏకాంబరం ఫైళ్ళు మూస్తుండగా తన దగ్గర కొచ్చి కూర్చున్న గుర్నాథాన్ని చూసి ఆశ్చర్యపోయాడు-

హలో హలో పలకరింపులు, ఆఫీసు ఫైళ్ళ మాటలు తప్ప అంత తీరిగ్గా గుర్నాథం ఎన్నడూ తన దగ్గరకి వచ్చి కూర్చోలేదు-

"లంచ్‌కు వెళ్తున్నావా ఏకాంబరం?..." మాటల కోసం తడుముకుంటున్నాడు గుర్నాథం.

"ఆ ఆ... ఏమన్నా పనుందా?" అడిగాడు ఏకాంబరం.

"పనంటె..." ఎలా మొదలుపెట్టాలో అర్థం కాలేదు గుర్నాథానికి.

"ఇవ్వాళ నిన్ను చూస్తుంటే చికెన్ బిర్యాని తినిపించాలనిపిస్తున్నది గురూ... నువ్వు శుద్ధ శాకాహారివి కదూ- ఆలు బిర్యాని, ఆవునెయ్యి స్వీటు నీకు తినిపించాలని వుంది గురూ- కాని ఒక్క పార్టీ కూడా తగల్లేదు. ఇవ్వాళ బిజినెస్ డల్‌గా వుంది. జేబులో ఒక్క పైసా లేదు..." ఏకధాటిగా మాట్లాడేస్తున్నాడు ఏకాంబరం.

'తనింకేం మాట్లాడాలి. తను అప్పు కోసం వచ్చినట్టు అడగకముందే పసిగట్టేశాడా! జేబులో పైసా లేదని చెబుతున్నాడు....'

ఏదేదో మాట్లాడి- "ఏం లేదు. ఊరికెనే ఇలా వచ్చాను. లంచ్‌కు వెళ్ళిరా" అంటూ లేచి తన సీటు వైపు నడిచాడు గుర్నాథం. సీట్లో కూర్చునేదాకా వంచిన తల ఎత్తలేదు. అప్పుడుగాని వేగంగా కొట్టుకుంటున్న అతని గుండె కాస్త నెమ్మదిపడలేదు. అప్పటి దాకా



అతడు ఆఫీసులో ఎవరినీ అప్పు అడగలేదు.

'సీనియర్ అసిస్టెంట్ శైలజగారిని అడగనా?...' మనసులో కూడా మర్యాదల్ని మానేయడు గుర్నాథం. శైలజగారిని అడగనా, వద్దా అని ఆలోచించసాగాడు- అడగవద్దని అభిమానం, అడుగు పొమ్మని అవసరం- ఎటూ తేల్చుకోలేక గిలగిల్లాడిపోయాడు. చివరికి అవసరానిదే పై చేయి- లేచి నిల్చున్నాడు వెళ్దామని. కాని అడుగులు పడలేదు.

'శైలజగారి దగ్గర తనకు అప్పు అడిగేంత చనువు వుందా?'

తిరిగి తన సీట్లో కూర్చున్నాడు- మరోసారి లేచాడు.

రెండుసార్లు పెదవులు తడుపుకున్నాడు. మూడు సార్లు గొంతు సవరించుకున్నాడు. అయిదుసార్లు నీళ్ళు తాగాడు. ఎన్నడూ లేనిది ఆ రోజు కూజా నీళ్ళు, గ్లాసుతో గాఢమైన స్నేహం చేశాడు.

చివరికి శైలజగారికి ఆఫీసర్‌గారితో గల సాన్నిహిత్యాన్ని గుర్తుకు తెచ్చుకుని, కుర్చీలో తనను దిగేసుకున్నాడు. ఆఫీసర్ గారు "వాట్ మిస్టర్ గుర్నాథం.... ఆఫీసులో అందరి దగ్గర అప్పులు చేస్తున్నారట?" అని

అడిగినట్టు తలచి అవమాన భారంతో కుంచించుక పోయాడు గుర్నాథం-

'టైపిస్ట్ శ్యామలగారిని అడిగితే?... అవును- శ్యామల గారినే అడగాలి. శ్యామలగారితోనే తనకు కాస్త పరిచయం ఎక్కువ. కాని శ్యామల గారు అప్పలు ఇస్తారా? సంసారాన్ని భుజంమీద వేసుకున్నారు కదా- అప్పులు తీసుకుంటారు.'

మూల సీట్లోని ముకుందం గుర్తుకొచ్చాడు గుర్నాథానికి. మెడలో పులిగోరు బంగారు గొలుసు- చేతికి బంగారు చెయిన్ గడియారం- వేళ్ళకు బంగారు ఉంగరాలు- నోటిలో రెండు బంగారు పళ్ళు- కళ్ళకు బంగారు ఫ్రేమ్ అద్దాలు- ముకుందానికి బంగారానికి విడని బంధం.

'ఫస్ట్‌కు ఇచ్చేస్తాను ఒక్క ఫిఫ్టీ సర్దమంటె సర్దక పోతాడా!... ఏమో! తనకేసి హేళనగా చూస్తాడేమో-

'ఎన్నిసార్లు చెప్పాను విన్నావా గుర్నాథం- ఈ కాలంలో సత్య హరిశ్చంద్రుడిలా బ్రతకలేవు. లౌక్యం నేర్చుకో- కార్డో గొప్పో పార్టీల జేబుల్ని దించేసుకో- ఇలా అప్పుల కోసం ఇబ్బంది పడవు-' అంటూ ఉచిత సలహా ఒకటి పారేస్తే...'సలహాలు అతని హాబీ... సహాయం అతడు చేయని పనుల్లో ఒకటి- ఇతరుల మీద నవ్వులు, హేళనలు అతనికి పల్లీలు, మిరపకాయ బజ్జీలు.

అతని నోటికి ఎర కావడం గుర్నాథంకు ఇష్టం లేదు.

ఆ ఆఫీసులో అతి తక్కువగా మాట్లాడేవాడు, ఎక్కువగా జేబులు దించేసుకునేవాడు మురారి.

మురారిని చూస్తే దోచుకోబడినవాడిలా వుంటాడు గాని, దోచుకునే వాడిలా వుండడు. సరిగా దువ్వుకోని క్రాఫ్... జిడ్డోడే మొహం... నల్లని కాలర్... నలిగి పోయిన దుస్తులు... కాళ్ళకు ఎప్పుడూ పాత చెప్పులు... నోటిలో కొనని పాను, కొనని సిగరెట్, వందలే కాని పదులు, ఐదులు ముట్టుకోడని ప్రతీతి. ఆ డబ్బంతా ఏం చేస్తాడు?... కొడుక్కు స్కూటర్, బార్లు- భార్యకు ఫ్యాషన్లు- కలర్ టి.వి., ఫ్రిజ్‌లు-తన ఇంట్లో మురారి పని మనిషిలా కనబడతాడు. అందమైన ఫోటోలో బొద్దింకలా కనబడతాడు.

ఆఫీసుకు వచ్చే పార్టీలకు అతడు మారువేషంలో వున్న యముడిలా కనిపిస్తాడు.

ప్యూన్ మైసయ్యకు మాత్రం అతడు 'శాన మంచి దొర', ధర్మరాజు, దానకర్ణుడు- పార్టీలచేత తనకు మామూళ్ళు ఇప్పిస్తాడు.

మురారిని అప్పు అడగాలని గుర్నాథం ఆఖరు నిశ్చయానికి వచ్చాడు. లేచి మురారి సీటువైపు నడిచాడు.

అప్పటికే ఒక కొలీగ్ మురారి సీట్ ముందు రిక్వెస్ట్ మొహం పెట్టుకుని కూర్చున్నాడు.

మురారి తన ట్రేడ్‌మార్క్ సీరియస్‌నెస్‌లో అతనికి జవాబు చెబుతున్నాడు-

"సారీ మిస్టర్ రావు- ఇంకో గంట ముందు వచ్చి వుంటే ఇచ్చేవాణ్ని- నా ఫ్రెండ్ ఒకతను వస్తే ఇచ్చేశాను."

## తాళిబొట్టు-నోట్ల కట్టా

గోపయ్య చేతిలో తాళిబొట్టు
గోపెమ్మ చేతిలో నోట్ల కట్టా
బొట్టు కావాలా
కట్ట కావాలా
ఆ బొట్టూ ఈ కట్టా ఉంటేనే మన పెళ్ళి ॥గో॥

డబ్బు చేసే మాయ గోలలో
నిశ్చయమైన నా రేటులో
ధబ్బు ... ... ... ...
డబ్బు బాధి తుణ్ణీ లే
కనకా రాధ కుణ్ణీ లే
కట్టలన్ని అడగనేలరా
ఎక్కువింక ఇవ్వలేనురా
డబ్బులింక అడగకుండ
యిచ్చినన్ని తీస్కోరా ॥గో॥

అందించాలి నోట్లు ముందుగా
చెల్లించాలి రేటు పూర్తిగా
ఆ డబ్బు ... ... ... ...
ఆ డబ్బే లేక పోతే
నా రేటే రాకపోతే
నీ వెంత అంద గత్తె వైనా
నీ చదు వెంత ఎక్కు వైనా
కట్నం మాత్రం యివ్వకుంటే
మూడు ముళ్ళు వెయ్యనులే ॥గో॥

-ధరణి వాణి

["గోపెమ్మ చేతిలో గోరుముద్ద"
('ప్రేమించు- పెళ్ళాడు')
పాటకు పేరడీ]

"ఒక్క హండ్రెడ్ వున్నా సర్దు గురూ. రేపు సాటర్‌డే- మలక్‌పేటకు పోకపోతే మనసు మనసులో వుండదు-" అన్నాడు రేసుల పిచ్చి వున్న సుబ్బారావు.

ఆఫీసులో అప్పులివ్వడం మురారికి ఇష్టం వుండదు. బయట వడ్డీ ఎక్కువ- కూపీలు తక్కువ.

ఆ సంభాషణ విన్న గుర్నాథం అక్కడ ఆగలేదు. అలవాటు ప్రకారం అశోకా హోటల్ దాకా వెళ్ళి ఏమీ తీసుకోకుండానే వెనక్కు తిరిగొచ్చేశాడు.

సీట్లో కూర్చున్నాడే గాని అతని మనసంతా ఇంటి చుట్టే పరిభ్రమిస్తున్నది-

'అర్జంటుగా తనకు అరవై రూపాయలైనా కావాలి- ఎలా వస్తాయి?... ఎలా వస్తాయి?... ఏం చెయ్యాలి?'

'మాడు గుర్నాథం ఎన్నాళ్ళిలా గిరి గీసుకుని బతుకుతావోయ్... మేమందరం తీసుకోటంలా? పార్టీలు పాడి ఆవులోయ్... పిండుకో...' ముకుందం ఎదుట నిల్చి మాట్లాడినట్టే అనిపించింది.

'ఛా... ఛా... లంచం తీసుకోవడమా? చదువుకునే రోజుల్లో ఎన్నెన్ని నిర్ణయాలు... నీతికి నిజాయితీకి కట్టుబడి బతకాలని, అదే దేశసేవ అని ఎన్నెన్ని ఆదర్శాలు...' అవన్నీ మరచిపోయి... ఛా ఛా... నన్ను నేను మోసం చేసుకుని బతకడమా... గుండె ఘోషి స్తోంది.'

నీ కొడుకు పరిస్థితిని మరచిపోతున్నావా?... పనికి రాని నీతిని నమ్ముకుని కొడుకును ఒదులుకుంటావా?

'సీను... సీను... ఎలాగుంది తండ్రీ నీకు. నేనేం చేయను- ఈ అసమర్థుని కొడుకువైన నేరానికి శిక్ష అనుభవిస్తున్నావా- నాన్న మందులు తెస్తాడు నా జొరం తగ్గుతుందని ఎంత ఎదురుచూస్తున్నాడో కదా పిచ్చి తండ్రి-'

ఇలాంటి విషమ పరిస్థితులే ని నిజాయితీకి అగ్ని పరీక్షలు- ఇన్ని రోజుల్నుంచి గుర్నాథం అంటే అగ్ని లాంటి మనిషని పేరు తెచ్చుకున్నావు- ఇప్పుడు తప్పటడుగు వేస్తావా?

నీతి, నిజాయితీ... మంచి మర్యాద, పవిత్రత- ఉత్త ట్రాష్... సమాజమంతా దొంగలు, దోపిడీదారుల నిలయమైనపుడు నువ్వొక్కడివి నీతిగా వుండి ప్రయోజన మేమిటోయ్? కుండెడు విషంలో ఒక్క పాలబొట్టు ఎందుకు పనికొస్తుందోయ్?

అక్కరకురాని నీతివాక్యాలు నెమరువేసుకుని చెడిపోకు. కమాన్- పార్టీని పట్టుకో- ఫైల్‌ను కదలనివ్వకు.

"సార్..."

ఉలిక్కిపడి చూశాడు గుర్నాథం.

ఎవరో పార్టీ-

"నమస్కారం సార్..."

"నమస్కారం ... నమస్కారం- కూర్చోండి."

అతడు కూర్చున్నాడు.

"నా పేరు సింహాచలం సార్... అదే నల్గొండ కేసు సార్- నా భార్యకు వరంగల్‌లో పోస్టింగ్- నాకు నల్గొండలో పోస్టింగ్... మా ఇద్దరిని కలిపి పుణ్యం కట్టుకోండి సార్... మా అర్జీ ఫైల్ మీ దగ్గరే వుంది... మీరు నోట్ పుటప్ చేస్తేకాని..."

మాడవోయ్ గుర్నాథం. ఇదే మంచి అదును- వీడికి ఉద్యోగమట. వీడి భార్యకు ఉద్యోగమట. ఊ... లాగేయ్-ఎంతైనా ఇచ్చుకుంటాడు.

గుర్నాథం గుండె వేగంగా కొట్టుకుంటోంది.

"మాట్లాడరేం సార్..."

"ఊ... చేస్తాను. వెంటనే పుటప్ చేస్తాను."

ప్చ్! లాభం లేదోయ్.

"వస్తాను సార్... మీరు మాటంటే తప్పరని విన్నాను-" అతడు రెండు చేతులు జోడించాడు-

గుర్నాథం కూడా రెండు చేతులు జోడించి కర చాలనం కూడా చేశాడు.

పార్టీ వెళ్ళిపోతుంటే ఒకవంక గర్వంగా, మరోవంక




విచారంగానూ వుంది గుర్నాథానికి-

పార్టీ డబ్బు చేతిలో పెడితే ఏం చేసేవాడివి? తిరిగి ఇచ్చేవాడివా? తీసుకునేవాడివా? ఏం చేసేవాడివి? ఏం చేసేవాడివి? ఏం చేసేవాడివి?

భారంగా తల పట్టుకున్నాడు-

తనలో ఏదో మార్పు వస్తున్నట్టు ఆందోళన చెందాడు- వెంటనే ఆ ఫైల్‌ను పుటప్ చేశాడు. కాస్త ప్రశాంతత లభించింది.

కింద కాగితాలు పడిపోతే వంగి తీసుకుంటున్నాడు. నూరు రూపాయిల నోటు కనిపించింది. షాక్ తిన్నాడు గుర్నాథం. కింద కనిపించిన ఆ నోటును చూసి పామును చూసినట్టు బెదిరిపోయాడు. పార్టీ బల్లమీద పెట్టి పోతే కింద పడిందా!

'వస్తాను సార్... మీరు మాటంటె తప్పరని విన్నాను'- అతని మాటలు గుర్నాథం చెవుల్లో గింగురు మంటున్నాయి-

తీసుకో గుర్నాథం- నువ్వు కావాలని అడగలేదుగదా- పార్టీ తనంతట తానే ఇచ్చిపోయాడు- ఈ డబ్బుతో నీ కొడుక్కు మందులొస్తాయి- నీ కూతురికి పాలడబ్బా వస్తుంది.

ముచ్చెమటలు పోశాయి గుర్నాథానికి చుట్టూ చూశాడు. ఎవరి పనుల్లో వారున్నారు... కాదు కాదు. చూడనట్లు నటిస్తున్నారేమో... తాను ఆ నోటు తీసుకుంటున్నప్పుడు చూస్తారేమో... ఎవరైనా నన్ను ట్రాప్ చేయడానికి ఈ పార్టీని, నోటును సృష్టించలేదు కదా... అతడు భయంతో మరోసారి చుట్టూ చూశాడు- టక్ టక్... శ్యామలగారు టైప్ కొడుతున్నారు- శైలజగారు నవల చదువుకుంటున్నారు... ఏకాంబరం, మురారి, ముకుందం ఎవరి పనుల్లో వారున్నారు- ఎక్కడా కొత్తవారు లేరు. ఫోటోగ్రాఫర్ లేదు- పోలీసు జవాను లేదు- అనుమానం కలిగించే ఏ దృఢకాయుడూ- కొత్త మనిషి లేదు.

కుండెడు విషంలో ఒక్క పాలబొట్టు ఎందుకు పనికివస్తుంది గుర్నాథం? ముకుందం, మురారి చెరో చెవిలో దూరినట్టుగా వుంది గుర్నాథానికి-

'నాన్నా! మురళీ, ప్రకాశ్ స్కూల్‌కు వెళ్తున్నారు- నే నెప్పుడు పోతాను నాన్నా...' దీనంగా అడుగుతున్న కొడుకు అతని కళ్ళలో కనిపించాడు- తల్లిపాలు చాలక ఏడ్చే చంటిది కళ్ళలో మెదిలింది- గబుక్కున కిందకి వంగి కాగితాలతోపాటు నోటును తీసుకున్నాడు... జేబులో వేసుకున్నాడు... అది అప్పు అనుకున్నాడు- మళ్ళీ పార్టీ కనిపించినప్పుడు తిరిగి ఇచ్చేస్తాను అనుకున్నాడు...

అయినా అతని చేతులు వణుకుతున్నాయి. కర్చీఫ్‌తో మొహం ఒకసారి తుడుచుకుని హాలంతా కలయ చూశాడు- శ్యామలగారు టక్ టక్... శైలజగారి సీటు ఖాళీ... ఏకాంబరం సిగరెట్ వెలిగించుకుంటున్నాడు- ఎవరూ తనవంక చూడడం లేదు... తేలికగా ఊపిరి పీల్చుకున్నాడు. చూసి చూడనట్టు నటిస్తున్నారేమో... అతని గుండె గుభేలుమంది. జేబు బరువెక్కుతున్నది. నోటు రాయాలంటే వేళ్ళ మధ్య కలం నిలవడం లేదు. అతని తల నుంచి ఆవిర్లు లేస్తున్నాయి. 'తాను... తాను... లంచం తీసుకున్నాడా!... ఇది లంచమా అప్పా? అప్పు- కాదు లంచం- కాదు అప్పు- కాదు లంచం- లంచం-లంచం-లంచం...!'

అనుకోకుండా అప్పుడే సీటులోకి వచ్చి కూర్చున్న శైలజగారి వంక చూశాడు. ఆమె గుర్నాథాన్ని చూసి చిన్నగా నవ్వింది. అతనికి గుండె ఆగినంత పనయింది. 'శైలజ గారికి తెలిసిపోయిందా... ముకుందం మురారి చెవిలో ఏదో చెబుతున్నాడు. సూపరింటెండెంట్ జనార్దన్‌ను ఏదో అడుగుతున్నాడు... తన గురించే అయుంటుంది.

ఏకాంబరం తనవంకే ఎందుకు చూస్తున్నాడు?'

"హలో గురూ..."

ఉలిక్కిపడి చూశాడు గుర్నాథం.

ఎదురుగా కొలీగ్ అప్పలనాయుడు- తన లంచం సంగతి తెలిసి వాటా కోసం రాలేదుకదా...

పరీక్షలు సిన్సియర్‌గా రాస్తాడనుకున్న విద్యార్థి కాపీ చేస్తూ దొరికిపోయినట్టుగా వుంది గుర్నాథం పరిస్థితి- ఎవరు మాట్లాడుకున్నా తన గురించే... ఎవరు నవ్వినా తనను చూసే అనుకుంటున్నాడు-

అప్పలనాయుడు ఏదో ఫైల్ అడిగితే తీసిచ్చాడు- 'ప్యూన్ మైసయ్యను పంపించక, ఫైల్ కోసం ఇతడే స్వయంగా ఎందుకొచ్చినట్టు...'

"ఈ ఫైల్ కాదు గురూ... థ్రిటీ టూ నంబర్ ఫైల్..."

ఆ నంబరు ఫైల్ తీసిచ్చాడు-

అప్పలనాయుడు వెళ్ళిపోయాడు-

"ఏంది సార్? తల పట్టుకున్నారు..."

కళ్ళు తెరిచి చూస్తే మైసయ్య-

"ఆ... కొంచెం తల నొప్పుతున్నది..."

"టాబ్‌లెట్లు గిట్ల తేవాల్నా సార్..."

'చెప్పినా పని చేయను- బయటి పనికి నన్ను పంపించ వద్దు అనేవాడు- ఇవ్వాళ తనంతట తానే టాబ్‌లెట్లు తెచ్చిస్తాను అంటున్నాడే...

మైసయ్యకూ తెలిసిపోయినట్లుంది- నేను లంచం తీసుకున్నట్లు... తన మామూలు కోసం వచ్చాడు...'

అనుకున్నాడు గుర్నాథం-

"వొద్దులే... అదే తగ్గిపోతుంది-"

"దొర రమ్మన్నాడు..."

"ఊ...!" తలమీద పిడుగు పడినట్లయింది గుర్నాథానికి- 'అప్పుడే ఆఫీసరుగారి చెవిలో ఎవరో ఊదేశారా!... ఇందాక శైలజగారు వెళ్ళింది ఆఫీసరు గారితో ఈ విషయం చెప్పడానికేనా!...'

కర్చీఫ్ కోసం తడుముకున్నాడు-

"ఒక్కరే వున్నారా?"

"ఆ... ఇందాక ఎవరో దొరలు వొచ్చిపోయిండ్లు-"

'ఆ వచ్చినవాళ్ళు ఇంటెలిజెంట్ డిపార్ట్‌మెంట్ వాళ్ళు కాదుగదా... తన గురించి వాకబు చేయలేదు కదా...

'తీసుకోక తీసుకోక ఒక్కసారి లంచం తీసుకుని ఎంత ప్రమాదంలో చిక్కుకున్నాడు...'

బెదురు బెదురుగా చూస్తూ ఆఫీసరుగారి గదిలో అడుగుపెట్టాడు గుర్నాథం.

ఏం వినాల్సి వస్తుందోనని అతని గుండె భయంగా కొట్టుకుంటున్నది. అడుగులు తడబడుతున్నాయి.

ఆఫీసరుగారి మొహం ఎప్పటిలా లేదనిపించింది- ఇదివరకు వారి మొహం చూస్తే ఆఫీసరుగారు అని పించకపోయేది- ఇప్పటి సీరియస్‌నెస్‌ను, కోపాన్ని చూస్తే పెద్ద ఆఫీసర్‌గారిలా కనిపిస్తున్నారు-

ఆఫీసరుగారి కుర్చీ ఎత్తుకు పెరిగి, తాను నిల్చున్న నేల కిందకి కృంగిపోతున్నట్లు ఫీలయ్యాడు గుర్నాథం.

"నిన్నటి వన్ నాట్ ఫైవ్ ఫైల్ ఏం చేశారు?"

"అయిపోయింది సార్- నోట్ పుటప్ చేస్తున్నాను"

"ఊ... త్వరగా పంపించండి."

"అయిదు నిమిషాల్లో పంపిస్తాను సార్..."

"ఊ..."

'హమ్మయ్య!' తేలికగా ఊపిరి పీల్చుకుని డోర్ వైపు నడుస్తున్నాడు గుర్నాథం. కాని అతనికి అనుమానంగానే వుంది- ఆఫీసర్‌గారు తనను వెనక్కు పిలుస్తారని.

అతని అనుమానం నిజమే అయింది.

"చూడండి గుర్నాథం గారూ..."

గుర్నాథం పంచ ప్రాణాలు పోయాయి.

వెనక్కు తిరగాలంటే భయంగా వుంది.

బెదురుగా చూస్తూ వెనక్కు తిరిగాడు. ఆఫీసర్ గారు సీరియస్‌గా ఏదో రాస్తున్నారు. తన సస్పెన్షన్ ఆర్డర్ కావచ్చునని హడలిపోయాడు గుర్నాథం.

"పిలిచారా సార్..."

నూతిలో నుంచి వస్తున్నట్టుగా వుంది అతని గొంతు.

"ఆ... పాపం మీకు పని ఒత్తిడి ఎక్కువయి నట్లుంది. మీ ఫైళ్ళు కొన్ని జనార్దన్ గారికి ఇవ్వండి. ఆ విషయం సూపరింటెండెంట్ గారికి రాస్తున్నాను-" అన్నారు ఆఫీసర్‌గారు.

"అలాగే సార్... థాంక్యూ సార్... థాంక్యూ..."

గబగబా ఆఫీసర్‌గారి గది బయటికి వచ్చేసి మొహం తుడుచుకున్నాడు గుర్నాథం.

'శైలజగారు తనను చూసి అదిగో నవ్వుతున్నారు... తుడుచుకున్న మొహం మళ్ళీ తడి తడి...

'ఆఫీసర్‌గారు నా ఫైళ్ళను ఎందుకు తగ్గిస్తున్నారు? నా దగ్గరికి వచ్చే పార్టీలను తగ్గించాలనేకదా! అంటే నేను పార్టీల దగ్గర లంచం తీసుకుంటున్నట్టు పసిగట్టి ఈ పని చేస్తున్నారా?...'

ఆ రోజు సాయంకాలం ఆఫీసు నుంచి దోషిలా తల వంచుకుని బయటికి వచ్చాడు.

దారిలో మందులు, పాలడబ్బా కొనుక్కుని ఇంటికి వచ్చాడు-

భార్య ఎంతో ఆనందంగా వాటిని అందుకుంటుంది అనుకున్నాడు-

కాని ఆమె ముభావం చూసి అతడు మరింతగా కృంగిపోయాడు-

## అతివృష్టి-అనావృష్టి

సూర్యుడు
వరుణుడు
కర్షకుడు
ఆడే
మ్యూజికల్ చైర్స్ ఆటలో
ఎప్పుడూ
కర్షకుడిదే
ఓటమి!

—అడిగోపుల వెంకటరత్నమ్

ఆమెతో మాట్లాడాలంటే అతనికి బెరుకుగా వుంది. సిగ్గుగా వుంది...

'అప్పుడే తాను ఆఫీసులో మొట్టమొదటిసారి తీసుకున్న లంచం భార్య చెవిలో ఎవరో వేయనే వేశారు...

అందుకే ఆ మౌనం... ఆ ముభావం... ఆ నిర్లిప్తత...'

బాత్‌రూమ్‌లో నీళ్ళు పెట్టానని చెప్పేదాకా కదలని వాడు తనకై తానే బకెట్‌లో నీళ్ళు తోడుకొని, టవల్ భుజాన వేసుకుని బాత్‌రూమ్‌వైపు నడిచాడు-

ఆ పనులన్నీ తనే చేసుకుంటుంటే భార్య చూసి ఊర్కుంటున్నట్టు... తనను తప్పుకుని తిరుగుతున్నట్లు అనిపించింది అతనికి-

'తనంటే భార్యకు కోపంగా వుంది.

'ఉండదూ మరి... ఇన్నాళ్ళూ తానొక నిజాయితీ పరుడైన ఉద్యోగి భార్య... ఇవ్వాళ తన భర్త కూడా లంచగొండి అయినందుకు బాధపడుతోంది. దానికి కారణం తనే. తన అశక్తతే. తన అసమర్థతే...'

అన్నం తింటున్నప్పుడు ఎప్పుడూ పక్కనే కూర్చునే భార్య ఆ రోజు భోజనం చేస్తున్న సమయంలో కూతురుకు పాలు చేసుకపోయి తాగించడం చూశాడు. మరింత కృంగిపోయాడు. పెళ్ళయిన తరువాత మొదటి సారిగా తను ఏకాకిగా ఫీలయ్యాడు-'అనుమానం లేదు- భార్యకు నిజంగా తనపై కోపం వచ్చింది. అసహ్యం కలిగింది. ఇక నుంచి అటు ఆఫీసులో తలెత్తుకోలేడు... ఇటు ఇంట్లోనూ తలెత్తుకోలేడు... అతడు కన్నీళ్ళను దిగమింగుకున్నాడు.

రాత్రి మంచినీళ్ళ చెంబు మంచం పక్కన పెట్టి వెళ్తున్న భార్య చేయి అందుకుని కూర్చోబెట్టి, ఆమె ఒడిలో తల వాల్చి వెక్కివెక్కి ఏడ్చాడు గుర్నాథం.

"ఈ ఒక్కసారికీ నన్ను క్షమించు సీతా- ఇంకెప్పుడూ ఇలాంటి నీచమైన పని చేయను..." అన్నాడు.

ఆమె అతని తలను నిమిరి "ఏం జరిగింది?" అని అడిగింది.

తలెత్తి భార్య కళ్ళల్లోకి చూశాడు.

భార్యకు ఆ విషయం తెలియదని అతనికి అర్థమయింది. జరిగినదంతా ఆమెకు చెప్పేశాడు. అంతా విన్నాక- "అయితే నేను మీ జేబులో పెట్టిన వంద రూపాయిల నోటు ఏమైనట్టు?" అని అడిగింది.

"నువ్వు పెట్టావా!" ఆశ్చర్యంగా ఆమెవంక చూశాడు గుర్నాథం.

"అవును... ఉదయం మీరు ఆఫీసు హడావిడిలో వుండి వినలేదేమో..."

"అలాగా... అయితే అది నువ్వు పెట్టిన నోటే అయివుంటుంది. నేను వంగినపుడు జేబు నుంచి కింద పడి వుంటుంది..."

ఎంతో బరువు తగ్గినట్లు... గుండెమీద నుంచి పెద్ద భారం తొలగినట్లు తేలికగా ఊపిరి పీల్చుకున్నాడు గుర్నాథం.

"ఎన్ని కష్టాలైనా రానీ... మీరు నీతి నిజాయితీ గల ప్రభుత్వ ఉద్యోగిగా జీవించడమే నాకు కావలసింది. అదే నిజమైన దేశసేవ. మనం చేయగలిగే జాతి సేవ..." అంది సీత.

"అవును సీతా. అదే నా ఆశయం. నీ ప్రోత్సాహంతో ఆ ఆశయానికి మరింత బలం చేకూరింది. ఇక ఎటువంటి బలహీన క్షణాలైనా అవలీలగా దాటగలను-"

ఉద్వేగంతో భార్య కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు గుర్నాథం.

ఆమె అతన్ని తన హృదయానికి హత్తుకున్నది.

"అవునూ... వంద రూపాయలు నా జేబులో పెట్టావుకదా... అంత డబ్బు నీ కెక్కడిది సీతా! అప్పు తెచ్చావా?" తలెత్తి ఆమెవంక చూస్తూ అడిగాడు.

ఆమె కాదన్నట్లు తల అడ్డంగా తిప్పింది.

"మరి?... ఎక్కడిది సీతా ఆ డబ్బు?"

ఆమె దీపం వంక చూస్తూ...

"మన వీధి చివర కొత్తగా స్కూలు తెరిచారు కదా... రోజూ మూడు పీరియడ్లు లెక్కలు చెప్పడానికి ఒప్పుకున్నాను. నెలకు నూట ఇరవై ఇస్తానన్నారు. వంద అడ్వాన్స్‌గా ఇచ్చారు" అంది.

